# మరో కోణం

సావిత్రి పక్కకి ఒత్తిగిల్లి పడుకుంది. నెమ్మదిగా కళ్లల్లో ఊరుతున్న కన్నీళ్ళు చెవి మీదుగా పాకి దిండుని చేరుతున్నాయి. అవెంత నెమ్మదిగా పుట్టుకొస్తున్నా అన్ని కన్నీళ్లను తలగడ తనలోకి పీల్చుకోడానికి శ్రమ పడుతోంది.

ఆమెకెంత ఏడ్చినా దుఃఖం తీరడం లేదు. ఇన్ని కన్నీళ్ళు తనలో ఇంకా నిలువ ఉన్నాయా అనే ఆలోచన కూడా ఆమెని అప్పుడప్పుడు ఆశ్చర్యపరుస్తోంది.

ఆ రోజు సావిత్రి పుట్టిన రోజూ, ఇరవై ఎనిమిది వెళ్ళి ఇరవై తొమ్మిదిలోకి అడుగు పెట్టింది. అంతక్రితమే తనని కన్నతల్లి వచ్చి జన్మలో మర్చిపోలేని దీవెనలిచ్చి వెళ్ళింది. చివరిమాట లింకా చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి.

"నువ్వెందులోనైనా పడి చచ్చిపోవే పాపిష్టిదానా! అసలు పుట్టలేదనే అనుకుంటాను. కాకపోతే పురిటల్లో చచ్చావనుకుంటా. ఇదిగో నువ్వు ఛస్తే ఒక్క కన్నీటి బొట్టు రాల్చనని నా తతిమా పిల్లలమీద ఒట్టేసి చెప్తున్నా".

తననిలా ఎక్కువసేపు ఒక్కర్తిని పడుకుని ఏడ్వనివ్వరని ఆమెకు తెలుసు. ఎవరో ఒకరు వచ్చి తన జుట్టు పట్టుకుని బయటకీడ్చి 'మేం చెప్పినట్టు విన్నావా సరే లేదంటే వెంటనే ఇక్కడ్నించి ఫో' అంటారు. ఆ అనే వ్యక్తి ఎవరు అనేది ఇంకా తేలాల్సి వుంది.

బయట నుంచి మాటలు విన్పిస్తున్నాయి. వాళ్లు నెమ్మదిగా ఏమీ మాట్లాడుకోవడం లేదు. గొంతులు చించుకుంటున్నారు. వారి ఉద్దేశ్యం కూడా తనకి వినబడాలనే. అందుకే ఒకర్ని మించి ఒకరు రెచ్చిపోతున్నారు.

"ఇలాంటి పాడుబుద్ధులు ఎక్కడ్నించి పుట్టుకొచ్చాయో మన ఇంటా వంటా ఎరగం. మనింట్లో ఆడపిల్లలంటే ఎంతో గౌరవంగా చూస్తారందరూ. ఇదిగో ఇలాంటిదొకతె తయారైతే చాలు అంతా. సర్వనాశనమైపోవడానికి.

"బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంది. పైగా ఏడుపొకటీ, పిల్లల్నేం చేద్దామను కుంటుందో అడగండి. ఇద్దరు పిల్లల తల్లీ ఛీ ఛీ తలుచుకుంటేనే కంపరంగా వుంది. ఇన్నాళ్ళు తర్వాత ఇప్పుడు మొగుడు నచ్చలేదుట".

"దాని చావది లోపల్లోపల చచ్చినా బోలెడంత ఆస్తి, కావలసినంత డబ్బు, కాలుమీద కాలేసుకుని గడిపేయవచ్చు. పిచ్చిదానికి అర్థం కావడం లేదు" ఆ మగ గొంతు స్వరం తగ్గించి కర్కశంగా హితబోధ చేస్తున్నట్లుగా వుంది.

"అది ఊ అంటేనే కదా పెళ్ళి చేశాం. ఇన్నాళ్ళు కాపురం చేసి ఇద్దరు పిల్లల్నికని వాళ్ళని వాళ్ళ కర్మానికొదిలేసి... ఛీ... అడగండి. ఏం చేద్దామనుకుంటోందో..."

సావిత్రి బాధగా, విరక్తిగా వాళ్ళ మాటలు వింటూనే వుంది. వాళ్ళ మాటలన్నీ నిజాలే.

వాళ్ళు ఇప్పుడు తనేం చెప్పినా వినిపించుకోరు. తనవైపు నుంచి ఒక్క క్షణం కూడా ఆలోచించరు.

❖ ❖ ❖

సావిత్రికి పద్దెనిమిదేళ్లు నిండగానే సుకుమార్ పెళ్ళి సంబంధం తీసుకొచ్చారు. బంధువులంతా కలసి, బోలెడంత ఆస్తి డబ్బు, ఒక్కడే కొడుకు, ఊళ్ళోనే రెండు ఇళ్లు కాణీ కట్నం అక్కరలేదు. పైగా పెళ్ళి ఖర్చు కూడా వాళ్లే పెట్టుకుంటారు.

సావిత్రి పేదింటి పిల్ల, ఇంకా నలుగురు పిల్లలున్న తల్లికి మొదటి సంతానం. అదీ ఆడపిల్ల. తండ్రి మంచానపడి ఏడాది దాటింది. ఇంట్లో గుక్కెడు గంజికి దిక్కులేకుండా వుంది.

సుకుమార్ అవిటివాడు. అతనికి మోకాళ్ళ నుంచీ రెండు కాళ్ళూ చచ్చుబడి పోయాయి. నడవలేడు. నిలబడలేడు. అయితే తెలివి వుంది. ప్రయివేటుగా పరీక్షలు కట్టి పాసయ్యాడు. టైపురైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్లు చేసి ఇంటిముందు గదిలో పది టైపు మిషన్లు పెట్టి ఇన్‌స్టిట్యూట్ పెట్టాడు. అది బాగా నడుస్తోంది. ఉన్న ఆస్తికి తోడుగా రెండూ కాళ్ళు లేకపోయినా రెండు చేతులా ఆర్జిస్తున్నాడు.

సుమార్ తల్లి, కోడలు కోసం వేట మొదలుపెట్టింది. అంగవైకల్యమున్న కొడుక్కి ఎవరు పిల్లనిస్తారు? పేదవాళ్ళు ఇస్తారు. అందచందాలు లేని వాళ్ళిస్తారు. డబ్బు చూసి మోజుపడే వారిస్తారు.

ఈ మూడు లక్షణాలు కలిసి వచ్చిన పిల్ల సావిత్రి ఆమె కంటబడింది. దగ్గర వాళ్ళ ద్వారా కబురుచేసింది.

పిల్లాడు కాళ్ళులేని వాడనేగాని మరోవంక పెట్టలేమని అందరూ అనుకున్నారు. ఆ లోటు లేకపోతే తామలాంటి సంబంధం కోటి జన్మలెత్తినా తేగలమా? అంటూ మురిసిపోయారు.

సావిత్రికి బాగా నూరిపోశారు. డబ్బు, పట్టుచీరలు, నగలు, ఇళ్ళూ వాకిళ్ళు అన్నీ బాగానే వున్నాయి గాని పెళ్ళి కొడుకే బాగాలేడని కొన్ని కోట్లసార్లు అనుకుంది సావిత్రి. ఆ ఒక్కటీ పక్కన పెట్టేసి మిగిలిన హంగుల్ని పొగడటం వదల్లేదు బంధుజనం.

సావిత్రి బాగా ఆలోచించుకోవడానికి వయసులేదు. శక్తిలేదు. మారాం చేసేందుకు వీలు లేదు. ఇంట్లో అందరూ తను ఊ అనాలని వేయి చెవులు రిక్కించి ఎదురు చూస్తున్నారు.

తను సరేననడం ద్వారా ఇంటి పరిస్థితి మారిపోతుంది. బెరుకుగా ఉన్నా ఎటూ తేల్చుకోలేనట్లుగా వున్నా సావిత్రి పెళ్ళికి సరేనంది. ఇల్లంతా ఆనందం వెల్లివిరిసింది.

పదిహేను రోజుల్లో ముహూర్తాలు పెట్టుకున్నారు. వెంకటేశ్వరస్వామీ గుళ్ళో పెళ్ళి చీరెలు, సారెలు, బాజా భజంత్రీలు.. అన్ని ఏర్పాట్లూ చురుకుగా మొదలయ్యాయి.

సావిత్రి పెద్ద తమ్ముడికి తను హామీ వుండి బట్టల కొట్లో వెయ్యి రూపాయల ఉద్యోగం వేయించింది అత్తగారు. కట్నం వీళ్ళేమీ ఇచ్చేది లేదు. ఆమె కుటుంబానికి కాస్త ముట్టచెప్పింది. తండ్రికి మందులు, తల్లికి ఒంటినిండా బట్ట, ఇంట్లో రెండు పూటలా భోజనం.

సావిత్రికి ఆనందమేసింది. తను తన కుటుంబానికి ఇంత మాత్రం సాయం చేయగలిగానని గర్వం కలిగింది.

పెళ్లి స్థిరపడిన వెంటనే తన ఆలోచనల్లో మార్పు తెచ్చుకుంది. అతని గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

అతను తనలా నడవలేడు. తనలా పరుగెట్టలేడు. తనలా తొక్కుడుబిళ్ళ ఆడలేడు. స్కిప్పింగ్ చేయలేడు. తన తమ్ముడిలా ప్లేగ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడలేడు. చెట్టెక్కలేడు. సైకిల్ తొక్కలేడు. పాపం! అతని మనసులో ఎంత బాధ వుంటుంది? అందుకే తను అతనసలు బాధపడకుండా చూడాలి. అతను క్రింద దేకుతూ వస్తాడు.

చేతులకి రబ్బరు తొడుగులు వేసుకుంటాడు. చంక కర్రలతో మూడు చక్రాల సైకిలెక్కి పోనిస్తాడు. కాని ఏ మనిషితోనూ సమానంగా భుజాలు తాకుతూ నిలబడలేడు. నడవలేడు.

అతనిలో ఆ తక్కువ భావం రాకుండా చూడాలి. అతను అందరికీ సమానుడే అనిపించాలి. అతను ఎవరికంటేనూ తక్కువ కాదనే భావం అతని మనుసునిండా నింపేయాలి. అతని భార్యగా అతని బాగుకంటే తనకేం కావాలి?

సావిత్రి ఇలాంటి ఆలోచనలు చేసి చేసి పెళ్ళికి మనసును స్థిరపరుచుకుంది.

తనలో ఏదైనా అసంతృప్తి ఉన్నా ఎవరికీ అది కనబడనీయకుండా జాగ్రత్తపడి నవ్వుతూ కలకల్లాడుతూ తిరిగేయాలని చివరిగా నిర్ణయించుకుంది.

పెళ్లయిపోయింది. కాళ్ళులేని మొగుడితో కాపురం మొదలు పెట్టింది సావిత్రి. ఆమెకదేం బాగుండకపోయినా సర్దుకుపోతూ కళ్ళు మూసుకుని కాలం గడపడం అలవాటు చేసుకుంది.

సుకుమార్‌కి పైకి కనిపించే అంగవైకల్యం కంటే భయంకరమైన వికృతరూపం లోపల వుందని చాలా తక్కువ సమయంలోనే సావిత్రి గ్రహించింది.

ఉక్రోషం, కోపం, అనుమానం, అసహనం, ఏ క్షణం ఎలా ఉంటాడో తెలీదు. అతనియందు జాలి కనబరచినట్లనుకుంటే 'నీ ముష్టి జాలి కోసం ఎవ్వరూ దేబరించలేరు' అంటూ కసురుతాడు. పోనీ ఏమీ లేనట్టు మామూలుగా వుంటే 'నేను అశక్తుణ్ణి కదా ఆ మాత్రం జ్ఞానం లేదు' అంటూ రెచ్చిపోతాడు. ఒక్కొక్కసారి కోపంతో ఊగిపోతాడు. ఉక్రోషంతో సాధిస్తాడు. చేసే ప్రతి పనిని అనుమానిస్తాడు.

ఆ రోజు అన్నం వడ్డించడంలో పొరపాటు జరిగింది. జారిపడిన అన్నం కంచమంతా చిందిపోయింది.

"రావే రా ఇటు రా" అంటూ గద్దించాడు.

అమాయకంగా భయంగా దగ్గరకు వెళ్ళింది. అమాంతం ఆమె జుట్టు పట్టుకుని వుంచి చెంపలు వాయగొడుతూ కుడిచేత్తో జబ్బ పుట్టుకుని ఎడం చేత్తో తొడపాశం అందుకున్నాడు. సావిత్రి ప్రాణం విలవిల్లాడిపోయింది. అలాంటి ఒక హింసాత్మకశిక్ష వుందనే అనుభవంలేకపోవడం వల్ల కంగారు పడిపోయింది. బాధతో వణికిపోయింది. కళ్ళ నీళ్ళు బొటబొటా రాలాయి. పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. ఇంతలో అత్తగారు వచ్చి "చాల్లేరా ఎవరేనా చూస్తే బాగుండదు" అంది.

అతను వదలగానే తూలిపోయి వెళ్ళి గోడకు కొట్టుకుని చతికిలబడింది. మోకాళ్ళ మధ్య తల పెట్టుకుని గొల్లున ఏడ్చింది. కాసేపు ఎవ్వరూ పట్టించుకోలేదు. నెమ్మదిగా లేవబోతే కుడికాలు కదపలేకపోయింది. ఒకటే సలుపు. కుంటుకుంటూ గదిలోకి వెళ్ళి చూసుకుంది.

తొడమీద బాదంకాయంత మేర నల్లగా కమిలిపోయి ఉంది. బుగ్గలు ఎర్రగా కందిపోయి ఉన్నాయి. అన్నింటికంటే ఆమెను అవమానభారం కృంగ దీసింది. ఆమెకు ఒక్కొక్క సంఘటనా గుర్తుకొచ్చి అసహ్యం పెరిగిపోసాగింది.

కొత్తగా చేయించిన కాలిమువ్వల పట్టాలు పెట్టుకుని అపురూపంగా అతనికి చూపించింది. చేతిలో వున్న స్కేలుతో ఫెడీఫెడీమని కొట్టాడు. అదేమిటంటే "నీకు కాళ్ళున్నాయని విరగబడిపోకు" అన్నాడు వికృతంగా నవ్వుతూ. వంటింట్లో పాలుపొంగుతున్నాయని పరిగెడితే అతను సహించలేకపోయేవాడు. వానొస్తోంది డాబామీద బట్టలు తడిసిపోతాయని రెండేసి మెట్లు ఎక్కుతూ ఆమె మేడమీదకి వెళ్తే రవరవలాడిపోయేవాడు. అతని కోపానికి కారణం తెలుసుకోవడం ఆమెకి సాధ్యమయ్యేది కాదు.

ఆలోచనలతో, దెబ్బతిన్న మనస్సుతో, దెబ్బలతో సావిత్రి అయోమయంలో ఉండగానే నెల తప్పింది. పై పై సంబరాలన్నీ మామూలే. ఆడపిల్లని కని అరిందగా అయింది.

బయట నలుగురిలో ఉన్నప్పుడు సుకుమార్ ముఖం ఒకలాగ వుంటే గదిలో తనతో వున్నప్పుడు మరోలా వుంటుందన్న సత్యాన్ని సావిత్రి గ్రహించింది కానీ చేసేదేం లేదు.

దూరంగా వుంటే రమ్మని పిలిచి మరీ బాదేవాడు. అతను పిలిచినప్పుడు వెళ్ళకుండా వుండే ధైర్యం ఆమెకెందుకో వుండేది కాదు.

అత్తగారు ఒకటి రెండుసార్లు చెప్పింది –

"వాడొట్టి కోపిష్ఠి వాళ్ళ నాన్నలాగా. కోపం తెప్పించకు".

తనెక్కడ కోపం తెప్పించింది? తను నవ్వితేకోపం. ఆనందంగా వుంటే కోపం. సావిత్రి వీలైనంతవరకు ముభావంగా ఉండేది. మనసు చచ్చిపోయింది. శరీరంలో కోరిక అడుగంటి పోయింది. అన్నం నీళ్ళు అడుగంటి పోయాయి.

కాలం వేగంగా పరుగెడుతోంది. తిట్లతో, శాపనార్థాలతో, దెబ్బలతో, గుద్దులతో, జీవితమూ గడుస్తోంది సావిత్రికి. మరో పిల్లా పుట్టింది.

పాతికేళ్ళు వయసొచ్చేసరికి సావిత్రిలో మార్పువచ్చింది. శరీరం మరింత అందంగా తయారైంది. వయసుతోబాటు ఆలోచన పెరిగింది. దానితో తనకి జరిగిన అన్యాయం అర్థమవసాగింది. గుండెలంతా దుఃఖం పేరుకుపోయి వుండేది. ఇల్లు నరకంలా, భర్త ముఖం చూడాలంటే అసహ్యంగా అనిపించేది.

పిల్లలందు పెద్దగా ప్రేమేం కురిసిపోయేది కాదు. అత్తగారే మనవరాళ్ళని ఎత్తుకునేది. సుకుమార్ అంటే భయం, అసహ్యం తప్ప ప్రేమ అనేది కలిగేది కాదు.

అప్పుడే ఆమె దృష్టిలో రవి రాజకుమారుడిగా కనిపించాడు. అతను ఉద్యోగ ప్రయత్నాలలో వుండి టైము వేస్టు కాకుండా టైపు నేర్చుకుందామని వచ్చాడు. రవి చాలా తెలివైనవాడు చూడముచ్చటగా వుండే రూపం. చక్కని మాట తీరు. అతను సావిత్రియందు కాస్తంత అభిమానం చూపాడు.

ఒకరోజు ఆమె గుడికి వెళ్ళి వస్తుంటే పలకరించి పక్కనే ఆమెతో కలిసి నాలుగడుగులు వేశాడు. ఆమె గుండె విచిత్రమైన ఆనందానుభూతికి లోనైంది. తన పక్కన అందంగా, దర్జాగా తనకంటే ఎత్తుగా ఒక మగాడు నడుస్తుంటే ఏదో గర్వంతో ఒళ్ళు పులకరించింది. ఇలాంటి అనుభవం చాలా కొత్తగా అపురూపంగా అనిపించింది. అతను నవ్వి వస్తానన్నట్లు పక్క వీధిలోకి వెళ్ళిపోతుంటే లోపలి ప్రాణాన్ని ఎవరో లాక్కుపోయినట్టయి పోయింది.

ఆ రోజు నుండి రవి వస్తూనే ఉన్నాడు. ఎలాగో సావిత్రిని పలకరిస్తూ ఒక జోక్ వేసి నవ్విస్తూ ఓ పొగడ్తతో వుబ్బేస్తూ అతనున్నంత సేపు అదొక వేరే లోకం అనిపింప జేసేవాడు.

సుకుమార్ పెద్దగొంతుతో అతనితో ఎన్నో చర్చలు చేసేవాడు. అతనికి ఆడవాళ్ల మీద వున్న అభిప్రాయాలు అతని మాటల ద్వారా విని రవి సావిత్రియందు ఒక సానుభూతిని పెంచుకున్నాడు. ఆమె మనసులో వున్న అసంతృప్తులను త్వరలోనే అర్థం చేసుకున్నాడు. ఆమె మీద జాలి, అందులోంచి ఆకర్షణ, ప్రేమ, తెగింపు ఒకదాని వెంట ఒకటి అతన్ని ఆక్రమించుకున్నాయి.

సావిత్రి రవి కలుసుకోడానికి ఎక్కువ కాలం పట్టలేదు. అసంతృప్తితో, అవమానంతో వేగిపోతున్న సావిత్రికి రవి సాంగత్యం ఒక ఆసరాగా అనిపించింది. ఆమెలో వున్న అసహాయత, ఆమెకి జరిగిన అన్యాయం, వాటిని మించిన ఆమె శరీర సౌందర్యం రవి ఆమెయందు గాఢమైన ప్రేమను పుట్టించాయి.

వీరి అనుబంధాన్ని పసిగట్టిన సుకుమార్ గొడవ చేశాడు. కుటుంబంలో పెద్దల్ని పిలిచి పంచాయతీ పెట్టాడు. అందరూ సావిత్రిని కేకలేశారు. తిట్టారు. నీతి బోధించారు. జీవితమంటే ఏమిటో వివరించారు. క్షణికమైన మోజుల్లో పడి పండంటి కాపురాన్ని చెడగొట్టుకోవద్దన్నారు. రత్నాల్లాంటి పిల్లల్ని చూసుకుని బుద్ధిగా ఉండమన్నారు. పెద్దపిల్లకి ఏడేళ్ళు. రెండో పిల్లకి అయిదు. వాళ్ళ భవిష్యత్తు ఆలోచించమన్నారు.

సావిత్రేం సమాధానం చెప్పలేదు. ఆమెకి అబద్ధమాడాలనిపించడం లేదు. మళ్లీ ఆ నరకంలోకి అడుగు పెట్టాలనిపించడం లేదు. ఎలాగు బయటపడిపోయింది. మళ్లీ లోపలికెళ్లడంలో అర్థం లేదు. ఏమీ లేనప్పుడు చిత్రహింసలు పెట్టిన సుకుమార్ ఇంత తెలిశాక మామూలుగా ఎలా వుంటాడు?

❖ ❖ ❖

సావిత్రి రెండో వైపుకి ఒత్తిగిల్లి పడుకుంది. ఇప్పుడు కన్నీళ్లు కారడం లేదు. ఆలోచనలు వేగంగా, పదునుగా సాగుతున్నాయి. జీవితంలో ఒకవైపు నుంచి మరోవైపుకి మళ్లినట్లుగా వుంది. ఆమె మనసులో, ఆలోచనల్లో రవి చోటుచేసుకున్నాడు. ఆమెకి ఆలోచించడం నేర్పినవాడు అతను. తనని నరకం నుండి తప్పించడానికొచ్చిన ఆపద్బాంధవుడిలా అనిపిస్తున్నాడు రవి.

తనని సుకుమార్ బాధిస్తున్నాడనీ, హింసిస్తున్నాడని తన తల్లికి తెలుసు, తమ్ముడికి తెలుసు, మంచంలో వున్న నాన్నకి తెలుసు. అత్తగారికి చూచాయిగా, బంధువులందరికీ తెలుసు.

కానీ ఎవ్వరు పట్టించుకోలేదు. అతన్నొక్క మాట అడగలేదు. ఎందుకని? భార్య మార్పుకోసం ఎదురుచూస్తూ జీవించాలనా? ఇప్పుడందరు పిల్లలు, పిల్లలు, పిల్లలు అంటూ గోల పెడుతున్నారు. అతను తనని నానా హింసలు పెడుతుంటే అవి భరించలేక తను ఎటైనా వెళ్లిపోతే, చచ్చిపోతే పిల్లల గతి ఏమిటని ఒక్కసారైనా అతన్నెందుకు అడగలేదు? ఇప్పుడు పిల్లల బాధ్యత తనదేనని, ఆ పిల్లలకోసం తను అతన్ని భరించాలని అనడం ఏం న్యాయం?

నిన్నగాకమొన్న ఇద్దరు బిడ్డల తండ్రి విశ్వం బాబాయి మరో అమ్మాయితో మూడు వీధుల అవతల వేరే కాపురం పెడితే 'నువ్విలా చేస్తే పిల్లలేమైపోతారు' అని ఒక్కరూ అడగలేదు. ఎందుకని? అంటే! వండి వార్చి, మూతులు కడిగి నీళ్ళుపోసి

జడలు వేసి బట్టలుకట్టి సాకే తల్లి పిల్లలకోసం ఇంటో కట్టుబడి వుంటేచాలు. ఆమె లేకపోతే పనంతా ఆగిపోతుంది. అందుకే ఆమె ఎటూ పోకుండా చుట్టూ వున్న అందరూ రక్షిస్తూ వుంటారు. ఆమె ఏ మాత్రం స్వేచ్ఛగానూ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వుంటారు.

ఏ మగాడు తను ఇల్లు వదిలిపెట్టి వెళ్ళేప్పుడు పిల్లల గురించి ఆలోచించాడు? ఏ మగాడ్ని పిల్లల గురించి బంధువులు, చుట్టాలు నిలేశారు? వెయ్యలేదు. వెయ్యరు. తరతరాలుగా పిల్లల్ని పెంచే బాధ్యత స్త్రీలదే అని నిర్దేశించారు. దాన్నే నమ్ముకుని నూటికి తొంభైమంది మాతృత్వపు మైకంలో బతికేస్తున్నారు. కానీ సర్దుకోలేక సంఘర్షణకి లోనయ్యేవాళ్ల గురించి ఎవ్వరూ కాస్తయినా ఆలోచించరేం?

అసలు భర్తని, ఇంటిని, పిల్లల్ని వదిలి ఏ స్త్రీ అయినా బయటకెందుకెళ్తోందో అని ఒక్కక్షణం ఆమె వైపు నుంచి ఆలోచిస్తే సమస్యలు అర్థమవుతుయి.

సుకుమార్ లాంటి వాళ్ళకి సరైన అవగాహన వుండేలా శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ఈ సమాజం మీద లేదా? కాళ్ళు లేని వాళ్ళు కాళ్ళున్న వాళ్లని ద్వేషించ కూడదనీ, గుడ్డివాళ్ళు చూడగలిగిన వాళ్ళని హింసించకూడదనీ, సృష్టి లోపం వల్ల అంగవైకల్యమున్నా మనసులో ఉన్నతిని, ప్రవర్తనలో సంస్కారాన్ని అలవరచుకోవాలని వాళ్లకి మనం నేర్పాలి కదా?

'నాకిది లేదు, నీకుంది కనుక నిన్ను నేను ద్వేషిస్తాను. హింసిస్తాను, నాకుండే ఈ లోపం వల్ల నన్ను భరించి తీరాలి అంటే - మనుష్యులందరూ సమానం అనే భావాన్ని మనమెలా పెంపొందించగలం? అంగవైకల్యమున్న వారిని మనలో ఎలా ఇముడ్చుకోగలం?

సావిత్రికి ఒక్కసారి తను పాతాళంలోకి కూరుకుపోతున్నట్టు భావం కలిగింది. ఈ పోరాటం తను చెయ్యలేదు. ఆడపిల్ల తన గురించి తను ఆలోచించుకునే లోపు, వివాహ వ్యవస్థను అర్థం చేసుకునేలోపు పిల్లలు పుట్టుకొచ్చేస్తారు. అక్కడ్నించి భార్యాభర్తలు కొట్టుకుంటూ కలిసి బతికేస్తుంటారు. పిల్లలకోసమే ఉన్నామని తల్లులు పూరట పొందుతుంటారు.

తన పిల్లలు దురదృష్టవంతులు. తన అదృష్టాన్ని తన తల్లిదండ్రులు నిర్ణయించ లేనట్లే తనూ వారి అదృష్ట దురదృష్టాలను నిర్ణయించలేకపోతోంది.

ఏమైనా ఇప్పుడు పిల్లలకోసం తను మళ్ళీ ఆ నరక కూపంలోకి వెళ్ళలేనని సావిత్రి గట్టిగా అనుకుంది. ఆమెకి మిగిలింది చావే అని నిర్ధారించుకుంది. అదొక్కటి

కంటికెదురుగా కనిపిస్తోంది. అదే అందరూ సూచించారు. అమ్మతో సహా, తను గుట్టుగా ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతే వాళ్ళ పరువుపోకుండా జబ్బు చేసి చచ్చిపోయిందని చెప్పుకుంటారు. మళ్లీ సుకుమార్‌కి పెళ్ళిచేసినా చేస్తారు పిల్లలకోసం అని.

అందరిలోనూ నవ్వులపాలైపోయింది. ఇంక ఏవైపుకి వెళ్ళి సాధించేది లేదు. కాస్త ధైర్యం కూడదీసుకుని కళ్ళు మూసుకుంటే – అంతే!

సావిత్రి నెమ్మదిగా లేచింది. గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఒళ్లు నీరసంతో తూలింది. నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ వెనుకవైపు వెళ్లింది. అక్కడంతా చీకటిగా వుంది.

మరొక్కసారి గుండె దిటవు చేసుకుంది. తను జీవితంలో పూర్తిగా ఓడిపోయానని తలచుకునేసరికి ఎక్కడలేని దుఃఖం వచ్చేసింది. తనకెవ్వరూ లేరని తలుచుకునే సరికి మరీ కన్నీళ్ళు ఆగలేదు.

నిగ్రహించుకుంటూ వెనుకవైపు తలుపుతీసింది. అడుగు ముందుకేసింది.

ఎదురుగా రవి. ఒక్కసారి సావిత్రి గుండె ఝల్లుమంది. ఆనందం కమ్మేసింది. కారు చీకటిలో చిరదివ్వెలా – కాళరాత్రి గడిచాక ఉదయించే సూర్యుడిలా ఎదరుగా రవి. అతడి పక్కనే నిలబడి అమ్మని బిక్కుబిక్కుమంటూ చూస్తున్న పిల్లలు.

(30–9–99 ఆంధ్రభూమి వీక్లీ)